ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి


విద్యార్థులతో నర్సయ్యగౌడ్

బోడుప్పల్: యువతీయువకులు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, లీగల్ సలహాదారులు మిట్ట నర్సయ్యగౌడ్ అన్నారు. చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 11వ నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫ్యూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగంలో రాణించేందుకు కృషి చేయాలని, అందుకు ప్రభుత్వాలు తమవంతు కృషి చేస్తున్నాయన్నారు. ఈ పోటీల్లో ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 12 ఏళ్ల లోపు చాంపియన్‌షిప్ పోటీల్లో వరుణ్ ప్రథమస్థానంలో నిలవగా, 12 ఏళ్లు పైబడిన పోటీల్లో జగత్ మొదటి స్థానంలో నిలిచాడు. టోర్నమెంట్ ఆర్గనైజర్ నందప్రసాద్, మాజీ వార్డు సభ్యులు తోటకూర రవీందర్‌యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా 11 కేవీ అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలో పలు కాలనీల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈస్ట్ బాలాజీహిల్స్, మిల్స్, పద్మావతి కాలనీ, అయ్యప్ప టెంపుల్ ఏరియా, శ్రీనివాస్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్: హబ్సిగూడ స్నేహపురి కాలనీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించనున్నందున మంగవాళవారం పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ తెలిపారు. స్నేహపురి కాలనీ వీధినంబర్- 4 నుంచి 5 వరకు, భవానీనగర్, శ్రీనగర్ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, నాచారం మెయిన్‌రోడ్డు, వీఎస్‌టీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఈస్ట్ చంద్రగిరి కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు లాల్‌వాణీనగర్, చంద్రగిరికాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

- వినాయకనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఓల్డ్ సఫిల్‌గూడ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వినాయకనగర్, ఓల్డ్ సఫిల్‌గూడ, దీన్‌దయాళ్‌నగర్, సుధానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన్‌క్రిస్టినా తెలిపారు.

రామంతాపూర్: ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసపురం విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శ్రీనివాసపురం ఈస్ట్ ఇందిరానగర్, చర్చికాలనీ, కామాక్షిపురం, శ్రీనివాసపురం, కమ్యూనిటీహాల్, వాసవీనగర్, వెంకట్‌రెడ్డినగర్ బస్టాప్, వివేక్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్ బస్టాండ్ ప్రాంగణంలో వెలసిన త్రిశక్తి నల్లపోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా సోమవారం వేదపండితులు మహాదేవభట్ల లక్ష్మణ్ ప్రసాద్‌వర్మ ఆధ్వర్యంలో స్థాపిత దేవత పూజలు, మూలమంత్ర జపం, రుద్రహోమం, ప్రదోష, మంగళ శాసనం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ చైర్మన్ గడ్డం సాయికిరణ్, అధ్యక్షుడు ఆవుల సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండపల్లి సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌గౌడ్, కోశాధికారి నవీన్‌రెడ్డి, శంకర్, హనుమంతరావు, వెంకటేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగానే ప్రజావాణి !


డీసీ చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమం

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 9 ఫిర్యాదులు అందాయని, డీసీ రాజు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో 3 , ఇంజినీరింగ్ విభాగంలో 2 , రెవెన్యూ విభాగంలో 2 , యూసీడీ ,వెటనరీ సెక్షన్‌లో ఒక్కొక్క ఫిర్యాదు అందాయని, వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజావాణి సమయంలో ఇతర సమావేశాలు ఏర్పాటు చేయకూడదని, అలాంటిది కుటుంబసర్వేపై గంటలకు పైగా సమావేశం నిర్వహించడంతో ప్రజలు బయటనే ఉన్నారని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. తాను వెళ్లి అడిగితే లోపలికి అనుమతించారన్నారు. ప్రజావాణి కార్యక్రమం తూతూ మంత్రంగానే జరుగుతోందని విమర్శించారు. అధికారులు హాజరుకావడం లేదంటే వారికి విధుల పట్ల ఉన్న బాధ్యత తెలియజేస్తుందని, న్యాక్ నుంచి వచ్చిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహించడం మానేసి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 8, 13 డివిజన్లలో సత్యలక్ష్మి, దివ్యకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బోడుప్పల్‌లో సోమవారం పంపిణీ చేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

నియోజకవర్గ పర్యటనలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడలో కొనసాగుతున్న ఆర్‌సీసీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రణాళికాబద్ధంగా నెరవేరుస్తున్నామన్నారు. నాయకులు రాముయాదవ్, కార్యకర్తలు, నాయకులు, మహిళలు తదితరులున్నారు.

రూ.32 లక్షలతో సీసీరోడ్డు పనులు..

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలోని చందాపురం కాలనీలో రూ.32 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని, ప్రతి డివిజన్‌లో కాలనీలను అభివృద్ధి చేస్తామన్నారు. మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, డీఈ ప్రశాంతి, ఏఎంహెచ్‌వో రజనీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామరాజు, కాలనీ అధ్యక్షులు సీతారాం, శ్రీనివాస్, వీఎస్.రాజు, ప్రేమ్, సతీష్, సాజిద్, జావేద్, అఫ్జల్ తదితరులున్నారు.

- వెంకటాపురం డివిజన్ పరిధి రాజీవ్‌గాంధీనగర్‌లో సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీనగర్ పక్కనే కంటోన్మెంట్ నియోజకవర్గంలోని చత్రిగడ్డకు ఆనుకుని ఉన్న ప్రహరీ సరిహద్దుగా ఉండటంతో పాములు, విషపురుగులు వస్తున్నాయని, వర్షాకాలంలో తీవ్రమైన వరద ప్రవాహంతో కాలనీ మొత్తం జలమయమవుతుందని స్థానికులు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే కంటోన్మెంట్ ఉన్నతాధికారులను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. శానిటరీ సూపరింటెండెంట్, ఎస్‌ఓలు రాజు, రాజేష్, రామకృష్ణ, సర్వేష్, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, సంపత్, మొసిన్ కాలనీవాసులు పాల్గొన్నారు.

- మచ్చబొల్లారం డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీలో ఎన్నో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాలనీవాసులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ అధ్యక్షుడు పవన్‌చారి, జైపాల్‌రెడ్డి, రాము, శ్రీను, కేశవరావు, అరుణవాసు, శ్రీనివాస్ యాదవ్ తదితరులున్నారు.


ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు


చందాపురం కాలనీలో ఎమ్మెల్యేతో కార్పొరేటర్ శాంతి


మిర్జాలగూడలో ఆర్‌సీసీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ సునీత


రాజీవ్‌గాంధీనగర్‌లో స్థానికులతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: అంతర్జాతీయ విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవాలని న్యూ ఢిల్లీ డిప్యూటీ చీఫ్ మిషన్ జోర్గాన్ ఆండ్రూస్, అమెరికా కాన్సులేట్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌లు అన్నారు. నాచారం సెంట్ పాయిస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో అంతర్జాతీయ విద్యావారం కార్యక్రమాన్ని నిర్వహించగా.. ముఖ్యఅతిథిలుగా పాల్గొని మాట్లాడారు. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించడంపై కీలకమైన మార్గదర్శకాలను వారు వివరించారు. యూఎస్ విద్యావ్యవస్థ అప్లికేషన్, ప్రామాణిక విధానాలు, స్కాలర్‌షిప్‌లు వీసా ప్రక్రియపై నిబంధనలను కూలకషంగా విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ వేలాంగిణి కుమారి, డీన్ డాక్టర్ ఆనీ సునీల్, అకడమిక్ డీన్ డాక్టర్ కమల ప్యానలిస్టులు ఎమిలియా, స్మిత్, పబ్లిక్ డిప్లమసీ ఫీసర్ బ్యూలా, రిసోర్స్ అసిస్టెంట్ అర్రిత్రా లహరి తదితరులున్నారు.



కార్యక్రమంలో జోర్గాన్ ఆండ్రూస్, జెన్నిఫర్ లార్సన్ తదితరులు

గణపతి దేవాలయంలో కార్తీక పూజలు



అల్వాల్: కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి దేవస్థానంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయ వ్యవస్థాపకులు, కార్యనిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో మహాస్పటిక శివలింగానికి భక్తులచే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, మహా పూర్ణాహుతి పూజలు చేశారు.

ప్రజల సహకారంతోనే పారిశుద్ధ్యం మెరుగు

మల్కాజిగిరి: కాలనీల్లో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేసి జరిమాన భారిన పడొద్దని మల్కాజిగిరి సర్కిల్ శానిటరీ సూపర్ వైజర్ చింత శ్రీనివాస్ సూచించారు. సోమవారం అనంత సరస్వతీనగర్‌లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా, మైక్ సిస్టమ్‌ను ప్రారంభించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడానికి తప్పనిసరిగా ప్రజల సహకారం ఉండాలన్నారు. చెత్త పాయింట్లను నూతన విధానంలో తొలగించాలంటే సహకారం ముఖ్యమన్నారు. ప్రతిరోజూ ఇంటింటికి వచ్చి చెత్త సేకరించే కార్మికుడికి వ్యర్థాలను అందజేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు, జరిమానపై అవగాహన కోసం మైక్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. కాలనీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసినందుకు వారిని ఆయన అభినందించారు. కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సత్తయ్యగౌడ్, యాదగిరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో శానిటరీ విభాగం అధికారులు

కనులపండువగా అయ్యప్ప మహాపడిపూజ


పడిపూజలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, భక్తజన సందోహం

కుషాయిగూడ: కుషాయిగూడ పారిశ్రామికవాడలోని అన్నపూర్ణ ఎస్టేట్‌లో అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో 28వ అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. గురుస్వామి వాసిరెడ్డి శివప్రసాద్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడి పూజలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్‌లు పాల్గొని పూజలు చేశారు. కేరళ సాంప్రదాయ పద్ధతిలో 18 పడి మెట్లను ఏర్పాటు చేసి వైభవంగా పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వాముల భజనలు, అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, గురుస్వాములు రఘు, శ్రీనివాసరావు, శివ గంగాధర్, మధుకర్‌రెడ్డి వీరశేఖర్, అమర్‌నాథ్, రామారావు, సాంబశివరావు, అశోక్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, విష్ణుమోహన్‌రావు, మల్లికార్జున్‌రెడ్డి, గడ్డమీది బాలరాజుగౌడ్, లక్కిడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కలశ పూజలో ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి

ఉద్యమ దినోత్సవం వేడుకలు



గౌతంనగర్: మల్కాజిగిరి కళాంజయం దాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యమ దినోత్సవ వేడుకలను ఇందిరానెహ్రూనగర్ క్లస్టర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలైన మహిళలకు నిత్యావసర సరుకులు, చీరలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఇన్‌చార్జి చందిరక, బీవోడి అనిత, శ్యామల, పుష్ప, ఈసీ లీడర్లు, అసోసియేట్స్ శారద తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్ష కేంద్రాల పరిశీలన


పరీక్ష కేంద్రం వద్ద అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

బోడుప్పల్: మేడిపల్లి మండల పరిధిలో జరుగుతున్న గ్రూప్ -3 పరీక్ష కేంద్రాలను సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పరిశీలించారు. బోడుప్పల్‌లో సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, ఉప్పల్ డిపో వద్ద ఒమెగా మహిళా డిగ్రీ కాలేజీల్లో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరగాలన్నారు. పరీక్షలు జరుగుతున్న తీరును స్థానిక అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు.

కార్పొరేటర్ వివరాల సేకరణ

మల్లాపూర్: సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో భాగంగా నాచారం హెచ్‌ఎంటీనగర్‌లోని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ నివాసంలో వారి కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్ ఎంటామాలజీ సూపర్‌వైజర్ నరసింహ వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సర్వేకు అందరూ సహకరించాలన్నారు.

నగదు చోరీ నిందితుడి రిమాండ్

రూ.1,75,000 రికవరీ

మల్లాపూర్: ఫుడ్ ఇండస్ట్రీస్ గోడౌన్‌లో నగదు దొంగతనాన్ని నాచారం పోలీసులు చేధించారు. నిందితుడి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ మాట్లాడుతూ.. మల్లాపూర్ పారిశ్రామికవాడలోని రోడ్ నెంబర్ 15లో బోడుప్పల్‌కు చెందిన ఎస్‌ఎం. శర్మ దేవి శాంతి ఫుడ్ ఇండ్రస్టీస్ పేరుతో కిరాణసరుకులు హోల్‌సేల్‌గా నగరంలోని వివిధ షాపులకు సరుకులను రవాణా చేస్తారు. ఈనెల 14న గోడౌన్‌షాప్ కౌంటర్‌లో రూ. 2 లక్షల నగదును ఉంచి ఇంటికెళ్లాడు. తిరిగి 15న షాపుకు వచ్చిన శర్మ కిటికీ గ్రిల్స్ తొలగించి ఉండటం గమనించి, వెంటనే నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మల్కాజిగిరి డీసీపీ అరవింద్, ఏసీపీ చక్రపాణి పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, క్రైమ్ సిబ్బంది సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. మల్లాపూర్ వెంకటరమణ కాలనీకి చెందిన ఆశపతిరాజు (40)ను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.1,75,000లను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు.


నిందితుడు ఆశపతిరాజు

గంజాయి ముఠా అరెస్ట్

10 కిలోల గంజాయి స్వాధీనం

అల్వాల్: గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి 10 కిలోల గంజాయిని అల్వాల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కానాజిగూడ గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో ఆదివారం గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు తనిఖీలు చేయగా.. ఆరుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశారు. ముగ్గురి వద్ద 10 కిలోల గంజాయి లభ్యమైంది. ఆంధ్రప్రదేశ్ అరకు నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విక్రయాలు చేస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. విక్రయిస్తున్న నిందితులు శేఖర్ (28), రవినాయక్ (25), మధుసూదన్ (25)లు ఉండగా.. కొనుగోలు చేస్తున్న వారు కల్యాణ్ (23), రాజు (24), నరేష్ (25)లు ఉన్నారు. వీరందరు హస్మత్‌పేటకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.


పోలీసుల అదుపులో నిందితులు

బస్తీ దవాఖానకు నేబిలైజేషన్ మిషన్



మల్లాపూర్: నాచారం బస్తీ దవాఖానకు స్థానిక నేత గ్యాసుద్దీన్ బీపీ, నేబిలైజేషన్ మిషన్‌ను సోమవారం నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ చేతులమీదుగా డాక్టర్ శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానలో మెరుగైనా వైద్యసేవలను అందించాలని సూచించారు. బీఆర్‌ఎస్ నేతలు మేకల ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, కర్ణ, రాజబాబు, ప్రీతిరెడ్డి, సంజన్న, బుచ్చన్నగౌడ్ తదితరులున్నారు.

అయ్యప్పమాలతో అనుమతించలేదని నిరసన

మల్లాపూర్: అయ్యప్ప మాలతో స్కూల్‌కు విద్యార్థులకు అనుమతించలేదని తల్లిదండ్రులు హిందూ సంఘాలతో కలిసి నిరసన చేపట్టారు. అయ్యప్ప మాల వేసిన ఇద్దరు విద్యార్థులు నాచారం సెంట్ పీటర్స్ స్కూల్లో చదువుతున్నారు. కాగా మాల ధరించి వారు స్కూల్‌కు వెళ్లడంతో యాజమన్యం అనుమతి లేదని బయటికి పంపింది. దీంతో అయ్యప్ప మాలదారులు స్కూల్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ పాఠశాల వద్దకు వచ్చి పాఠశాల యాజమాన్యంతో మాట్లాడటంతో ఆందోళన విరమించారు.

మెడికల్ షాపులో అగ్నిప్రమాదం

ఉప్పల్: ఉప్పల్ శాంతినగర్‌లోని మెడికల్ షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయి చైతన్య ఉప్పల్ శాంతినగర్‌లో దీపిక మెడికల్ షాపును నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి యధావిధిగా దుకాణానికి తాళంవేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో స్థానికుడు నరేష్‌కు ఫోన్‌చేసి మెడికల్ షాపులో నుంచి పొగలు వస్తున్నాయని సమాచారం ఇవ్వడంతో వెంటనే షాపు వద్దకు వచ్చాడు. అప్పటికే మంటలు అంటుకున్నాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలు ఆర్పివేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు అదృశ్యమైన బాలిక

పోలీసుల అదుపులో నిందితుడు


నిందితుడు మోహన్ కృష్ణ

ఉప్పల్: అదృశ్యమైన బాలిక ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేరింది. తండ్రి ఫణి భూషన్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సోమవారం మిస్టరీని చేధించారు. వివరాల ప్రకారం.. అదృశ్యమైన మైనర్ (17), గోల్నాక ప్రాంతానికి చెందిన గయ్యాల మోహన కృష్ణ(23) పారిశ్రామికవాడలోని ఫార్మా కంపెనీల్లో పనిచేస్తుంటారు. ఇద్దరు కలిసి సన్నిహితంగా ఉంటున్నారు. ఇదే క్రమంలో ఈనెల 14న మైనర్‌కు మాయమాటలు చెప్పిన కృష్ణ పాలకుర్తి వద్దకు తీసుకెళ్లి అక్కడే దేవాలయంలో పెళ్లి చేసుకున్నాడు. అనంతరం రేగుల గ్రామానికి తీసుకెళ్లాడు. రెండ్రోజుల తర్వాత సదరు బాలికకు తండ్రి గుర్తుకురావడంతో ఆదివారం రామంతాపూర్‌లో వదిలి వెళ్లాడు. తల్లిదండ్రుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు నిఘా ఉంచి సోమవారం రామంతాపూర్ విశాల్‌మార్టు వద్ద మాటు వేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రఘురామ్ తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడి రిమాండ్

అల్వాల్: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురంలోని ఓ అపార్టుమెంట్‌లో నివసించే బాలికపై బైక్ మెకానిక్ స్టీఫెన్ (21) లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. సదరు బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

యువకుడి ఆత్మహత్య

ఉప్పల్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా శాలిగౌరారం గ్రామానికి చెందిన మీసాల పుల్లయ్య కుమారుడు నరేష్ (22) వృత్తిరీత్యా బోడుప్పల్‌లోని ఓ కిరాణాషాపులో పనిచేస్తూ.. ఉప్పల్‌లోని శాంతినగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఆదివారం పనికి రాకపోవడంతో యజమాని పలుసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో ఇంటికి వచ్చి చూడగా.. తలుపు లోపలి నుంచి గడియ వేసి ఉంది. సాయంత్రమైన తలుపులు తెరవలేదు. దీంతో అనుమానం వచ్చి స్థానికుల సాయంతో తలుపు పగులగొట్టి చూడగా.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వారు మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి బద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.